ప్రజలకు రక్ష.. జగనన్న సురక్ష



జగన్న సురక్ష కార్యక్రమంలో ధ్రువపత్రాలను అందిస్తున్న ఆడారి ఆనంద్ కుమార్



కార్యక్రమంలో పాల్గొన్న స్థానికులు, మహిళలు

సాంకేతిక కారణాలతో ప్రభుత్వ పథకాలకు నోచుకోని వారికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శుభవార్త చెప్పారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వలంటీర్లను ఇంటింటికీ పంపించి వివరాలు సేకరించారు. పథకాలు పొందడానికి అవసరమైన 11 రకాల ధ్రువ పత్రాలు ఉచితంగా జారీకి అవకాశం కల్పించారు. పశ్చిమ నియోజకవర్గంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. అర్హులైన వారికి పశ్చిమసమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ధ్రువపత్రాలు అందజేశారు. దీంతో వారి మోములో ఆనందం కనిపించింది.

- ఇంటికి వెళ్లి కష్టాలు తెలుసుకుంటున్న ప్రభుత్వం ఇది
- విశాఖ పశ్చిమ సమన్వయ కర్త ఆడారి ఆనంద్ కుమార్
- 89వ వార్డులో విజయవంతంగా జగనన్న సురక్ష కార్యక్రమం



మాట్లాడుతున్న తహసీల్దార్ జయ

గోపాలపట్నం: ఇంటింటికీ వెళ్లి ప్రజల కష్టసుఖాలు తెలుసుకుని పరిష్కరిస్తున్న తొలి ప్రభుత్వం.. తొలి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని విశాఖ పశ్చిమ సమన్వయ కర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 89వ వార్డు నాగేంద్ర కాలనీలో శనివారం జగన్న సురక్ష కార్యక్రమం పండగ వాతావరణంలో జరిగింది. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ ఇంటికే పథకాలు అందించడంతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. గతంలో సర్టిఫికెట్ల కోసం అధికారులు చుట్టూ రోజుల తరబడి తిరిగే పరిస్థితి ఉండేదని.. నేడు జగనన్న అధికారులనే ప్రజల వద్దకు తీసుకెళ్లి ధ్రువపత్రాలు అందిస్తున్నారని చెప్పారు. ప్రజలకు మేలు కల్పించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టారన్నారు. ఇప్పటికే 90 శాతం మంది లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించామని తెలిపారు. అర్హత ఉండి సంక్షేమ పథకం రాని వారు లేకుండా ఉండేందుకు బృహత్ కార్యక్రమం చేపట్టారని తెలిపారు. సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులందరికీ ప్రయోజనం కలిగే విధంగా కార్యకర్తలు, గృహ సారథులు, ఆర్‌పీలు కృషి చేయాలని సూచించారు. వివిధ సర్టిఫికెట్ల కోసం 974 దరఖాస్తులు అందగా 847 దరఖాస్తులు పరిష్కరించారు. మిగిలిన వాటిని క్షుణ్ణంగా పరిశీలించి అవసరమైన ధ్రువపత్రాలు జారీ చేస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు, ఏపీడీ శ్రీధర్, నాయకులు అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ(గోపి), ఆళ్ల పైడిరాజు, మళ్ల శ్రీను, క్లస్టర్ ఇన్‌చార్జి గేదెల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షకు విశేష స్పందన

కంచరపాలెం: ప్రజలకు అతివేగంగా ప్రభుత్వ సేవలు అందించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం దోహదపడుతుందని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ పరిశీలకుడు ఎస్ఏ రెహమాన్ పేర్కొన్నారు. జీవీఎంసీ 57వ వార్డు ఐటీఐ జంక్షన్‌లో శనివారం 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల వినతులను సంతృప్తి స్థాయిలో పరిష్కరించడం, అర్హులందరికీ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చడమే లక్ష్యమని చెప్పారు. 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి అనుబంధంగా చేపట్టిన జగనన్న సురక్ష ద్వారా సచివాలయాల వారీగా ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నామని తెలిపారు. జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ మాట్లాడుతూ ఏ పథకం పొందాలన్న జనన, మరణ ధృవీకరణ పత్రాలు, సంబంధిత పత్రాలు ప్రతిఒక్కరికీ వచ్చే విధంగా కృషి చేస్తామని తెలిపారు. తహసీల్దార్ జయ, వార్డు కార్పొరేటర్ ముర్రు వాణీ, రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ శ్యామ్‌కుమార్‌రెడ్డి, వార్డు ఇన్‌చార్జి పల్లా ఎర్నికుమార్, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

రైస్ కార్డు వచ్చింది



రైస్ కార్డు కోసం ఇబ్బంది పడ్డాను. జగనన్న సురక్ష ద్వారా నాకు రైస్ కార్డు వచ్చింది. అంతే కాకుండా కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం వచ్చాయి. నాకు వలంటీర్లే ఈ పనులు చేశారు. మాలాంటి పేదల కోసం మంచి కార్యక్రమాలు చేస్తున్న జగనన్నకు కృతజ్ఞతలు.

– సీహెచ్ అమ్మాజీ, కొత్తపాలెం

జగనన్న మళ్లీ సీఎం కావాలి



గతంలో కులధ్రువీకరణ పత్రం కావాలంటే అధికారుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు ఏ కార్యాలయానికి వెళ్లకుండానే మాకు కుల, ఆదాయ సర్టిఫికెట్లు జారీ చేశారు. జగన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఇది సాధ్యమైంది. చాలా సంతోషంగా ఉంది. మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రిగా రావాలి.

– పి. సావిత్రి, కొత్తపాలెం

గొప్ప కార్యక్రమం

ఆధార్ కార్డుకు ఫోన్ నంబర్ అనుసంధానం చేసుకునేందుకు చాలా మార్లు ప్రయత్నించాను. కొన్ని సమయాల్లో అక్కడ అవకాశం లేకపోవడంతో బ్యాంకుల చుట్టూ తిరగలేక ఇబ్బంది పడ్డాను. ఇప్పుడు వలంటీర్లు గృహ సారథుల సాయంతో సులువుగా మా పని అయిపోయింది. జగనన్న సురక్ష కార్యక్రమం చాలా బాగుంది.

– రెడ్డి సూర్యకాంతం, కొత్తపాలెం

క్లుప్తంగా

రహదారి నిర్మాణ పనుల పరిశీలన



గణేష్‌నగర్‌లో రహదారి పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డు గణేష్ నగర్‌లో చేపట్టిన సీసీ రోడ్ల పనులను శనివారం డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. నాణ్యతా లోపాలు లేకుండా పనులను పర్యవేక్షించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. రహదారి గట్టిపడే వరకు రాకపోకలు చేయవద్దని స్థానికులను కోరారు. ఆయనతో పాటు ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న బెహరా భాస్కరరావు, వంజిరాపు రామకృష్ణ

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు వెంకటాపురంలోని పలు పాఠశాలల్లో రమణ మహర్షి భక్తుడు వంజిరపు రామకృష్ణ సమకూర్చిన పుస్తకాలను జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఇక్కడి వెంకటాపురం, పద్మనాభనగర్, ఎస్సీబీసీ కాలనీ, కంపరపాలెం ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు అప్పలస్వామి నాయుడు, కపర సత్తిబాబు, నీలాపు శ్రీనివాస రెడ్డి, దవళ మోహన్, కంపర కోటేశ్వరరావు, కంపర రామకృష్ణ, నందవరపు సోములు తదితరులు పాల్గొన్నారు.

టార్పిడో వైర్ గైడెన్స్‌పై వర్క్‌షాప్



రియర్ అడ్మిరల్ వెంకట్రామన్‌కు జ్ఞాపిక అందిస్తున్న డైరెక్టర్ జనరల్ శ్రీనివాసరావు

గోపాలపట్నం: ఎన్ఎస్టీఎల్ మానసి ఆడిటోరియంలో సబ్ మెరైన్ హెడ్ క్వార్టర్స్ ఆధ్వర్యంలో శనివారం టార్పిడో వైర్ గైడెన్స్ సూక్ష్మ నైపుణ్యాలపై వర్క్‌షాప్ నిర్వహించారు. దీన్ని విశిష్ట శాస్త్రవేత్త, డైరెక్టర్ జనరల్ (నేవల్ సిస్టమ్స్, మెటీరియల్స్) డాక్టర్ వై. శ్రీనివాసరావు, రియర్ అడ్మిరల్ కె. వెంకట్రామన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా వైర్ గైడెడ్ టార్పిడో నిర్వహణలో పొందిన నైపుణ్యాన్ని పంచుకోవడం ఈ వర్క్ షాప్ లక్ష్యమని తెలిపారు. ఎన్ఎస్టీఎల్ నుంచి శాస్త్రవేత్తలు, భారతీయ నావికాదళానికి చెందిన అధికారులు పాల్గొన్నారు. వర్క్ షాప్ వల్ల చాలా విషయాలు తెలుసుకున్నామని హాజరైన వారు సంతోషం వ్యక్తం చేశారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్ సమీపాన జూన్ 17న గుర్తు తెలియని ఒక వృద్ధుడు అపస్మారక స్థితిలో ఉండటాన్ని గమనించిన గవర్నమెంట్ రైల్వే పోలీసులు అదే రోజున 108 సహాయంతో అతడిని కేజీహెచ్‌కు తరలించారు. ఈ వ్యక్తి చికిత్స పొందుతూ జూన్ 30వ తేదీ అర్ధరాత్రి చనిపోయాడు. ఇతని వద్ద ఏ విధమైన ఆధారాలు లేవు. జీఆర్పీ ఎస్ఐ శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. వయసు సుమారు 75 ఏళ్లు ఉండవచ్చని, వివరాలు తెలిసిన 94406 27547/98664 13487 నంబర్లలో తెలియజేయాలని త కోరారు.

జీవితాన్ని ప్రభావితం చేసేవి కథలు

సీతంపేట: సమాజ స్థితిని, గతిని మార్చే శక్తి కథలకు ఉంటుందని కథా రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావు అన్నారు. లలితానగర్ లలితా పీఠంలో శనివారం జరిగిన కథా కచేరిలోఆయన ప్రసంగించారు. ప్రతి ఒక్కరి జీవితాన్ని ఏదో ఒక సందర్భంలో కథలు ప్రభావితం చేస్తాయన్నారు.

అధికారులకు దృష్టికి కార్మికుల సమస్యలు



మాట్లాడుతున్న ప్రబారి అన్నాజీ దుమాల్

కంచరపాలెం: భారతీయ పోర్ట్–డాక్ మజ్దూర్ మహాసంఘ్(బీపీడీఎంఎంఎస్) రెండు రోజుల సర్వసభ్య సమావేశం శనివారం 104 ఏరియాలోని బీఎంఎస్ కార్యాలయంలో నిర్వహించారు. మహాసంఘ్ అధ్యక్షుడు ప్రదీప్‌బిజిలి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులు బీఎంఎస్ ప్రబారి అన్నాజీ దుమాల్, సహ ప్రబారి చావ్లాజీ, ప్రధాన కార్యదర్శి సురేష్ పాటిల్ మాట్లాడారు. దేశంలోని అన్ని పోర్టుల్లో పనిచేస్తున్న రెగ్యులర్, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై చర్చించి వాటికి తగిన పరిష్కారాలను ప్రతిపాదించి, తీర్మాలను ఆమోదించి పోర్టు యాజమాన్యాలకు, ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. అఖిల భారత ఉపాధ్యక్షుడు ఎం.జగదీశ్వరావు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా అనేక పోర్టుల్లో జరిగిన సంఘటనలను బీఎంఎస్ సాధించిన విజయాలను విశదీకరించారు. కార్యక్రమంలో ఎంపీఎస్ నాయుడు, లాలం ప్రసాద్, సురేష్‌కుమార్, రామచంద్ర శేఖర్, భవానీ శంకరుడు, రవిశంకర్, గోపి పట్నాయక్, యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు చేరువైన దూరవిద్య



లంకపల్లి బుల్లయ్య విగ్రహానికి పూలమాల వేస్తున్న విశ్వేశ్వరరావు తదితరులు

ఏయూ క్యాంపస్: గ్రామీణ ప్రాంతాలకు సైతం విద్యను చేరువ చేయడానికి దూరవిద్య ఒక సాధనంగా నిలిచిందని ఆచార్య విశ్వేశ్వరరావు అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం 52వ వ్యవస్థాపక దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా దూరవిద్య కేంద్రంలోని డాక్టర్ లంకపల్లి బుల్లయ్య విగ్రహానికి కేంద్రం సంచాలకుడు ఆచార్య కె.విశ్వేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1972లో ఎంతో దార్శనిక ఆలోచనలతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారన్నారు. నాణ్యమైన విద్యను అందించడంలో ఏయూ దూరవిద్య కేంద్రం ముందుంటోందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ డైరెక్టర్ ఎం.వి.ఎస్.చంద్రశేఖర్, ఆచార్య కె.సత్యనారాయణ, డాక్టర్ రాజు, డిప్యూటీ రిజిస్ట్రార్ నారాయణ, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆవరణలో మొక్కలు నాటారు.

వీరుల త్యాగం వృథా కానివ్వం



దీక్షలో ప్రసంగిస్తున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు నినాదంతో సాధించుకున్న పరిశ్రమను చేజార్చుకోబోమని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. నాటి వీరుల త్యాగ ఫలితాన్ని వృథా కానివ్వబోమని స్పష్టం చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న దీక్షల్లో 870వ రోజు శనివారం సంస్థలోని ఈఎస్ అండ్ ఎఫ్, ఈఎండీ, ఈఆర్ఎస్, సేఫ్టీ, టెక్‌సెల్, ఎస్ఎస్‌డీ, ఆగ్రో తదితర విభాగాల కార్మికుల పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు స్ఫూర్తితో ఉక్కు పోరాటాన్ని కొనసాగిస్తున్నామన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తామని ప్రధాని నరేంద్రమోదీ స్పష్టమైన ప్రకటన చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

బీసీ సదస్సు నేడు

మద్రిపాలెం: ఈ నెల 2న జరిగే బీసీ సదస్సును విజయవంతం చేయాలని అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పప్పల రామ్మోహన్ పిలుపునిచ్చారు. 51వ వార్డు మాధవధార వుడా కాలనీలోని కార్యాలయంలో శనివారం మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. అఖిల భారత వెనుకబడిన తరగతుల సమాఖ్య, అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం ఆంధ్రప్రదేశ్ శాఖ సంయుక్తంగా మాధవధార వుడా కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి ఈ సదస్సు నిర్వహిస్తాయని తెలిపారు. దేశ జనాభాలో 52 శాతానికి పైగా ఉన్న బీసీలకు ఉద్యోగాలు, అధికారం, సంపదలో ఆ స్థాయి భాగస్వామ్యం లభించడం లేదన్నారు. వారి అభ్యున్నతి కోసం తీసుకోవాల్సిన చర్యలపై ఈ సదస్సులో సమగ్రమైన చర్చ జరుగుతుందని చెప్పారు. ఈ సమావేశానికి ఏఐబీసీఎఫ్ జాతీయ అధ్యక్షుడు, బీసీ హక్కుల ఉద్యమ నేత, రిటైర్డ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వి.ఈశ్వరయ్య, అనేక మంది జాతీయ నాయకులు, రాష్ట్రంలోని 132 వెనుకబడిన కులాల నాయకులు హాజరవుతారన్నారు.

రిటైర్ట్ ఉద్యోగులకు సన్మానం



కార్మికుడిని సత్కరిస్తున్న హెచ్‌పీసీఎల్ అధికారులు, సొసైటీ పాలక సభ్యులు

మల్కాపురం: హెచ్‌పీసీఎల్ సొసైటీలో విధులు నిర్వహించి గత నెల 30న ఉద్యోగ విరమణ పొంది న బాబూరావు,ఎం.శ్రీను (యారాడ)లను సొసైటీ పాలక వర్గ ప్రతినిధులు,సభ్యులు శనివా రం సత్కరించి,జ్ఞాపికలు అందజేశారు. సంస్థ ఆవ రణలో నిర్వహించిన కార్యక్రమంలో మేనేజర్ జాన్ చెర్రిన్ మాట్లాడుతూబాబూరావు,శ్రీను తమ తమ డిపార్ట్‌మెంట్‌లలో ఉత్తమ సేవలు అందించారని కొనియాడారు. శేష జీవన కాలం ఆరోగ్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు ఎన్. వి.రమణ,వై.ఎ.భాస్కర రావు,చొప్ప అప్పల రాజు, సర్వసిద్ధి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

123 మంది యువత రక్తదానం

కంచరపాలెం: వైద్యుల దినోత్సవం సందర్భంగా కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో లైఫ్ షేర్ బ్లడ్ సెంటర్, డెంటిలిజెంట్ డెంటల్ ల్యాబ్ ఆధ్వర్యంలో శనివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథి జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, డాక్టర్ పీవీ సుధాకర్‌లు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. కరోనా విపత్కాలంలో వైద్యులు ఎంతో మందికి రక్షించారని, వారి సేవలను ఎప్పటికీ మరువలేమని అతిథులు పేర్కొన్నారు. సుమారు 123 మంది యువత రక్తదానం చేసినట్లు ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ఆడారి కిషోర్‌కుమార్, డాక్టర్ శివప్రసాద్, గోపికృష్ణ, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్ఐపీఎంకు స్టీల్‌ప్లాంట్ పూర్తి సహకారం



స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ పాండేను సత్కరిస్తున్న ఎన్ఐపీఎం ప్రతినిధులు

ఉక్కునగరం: నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పర్సనల్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐపీఎం)కు స్టీల్‌ప్లాంట్ నుంచి పూర్తి సహకారం అందిస్తామని స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్) ఎస్.సి. పాండే తెలిపారు. శనివారం ఎన్ఐపీఎం విశాఖ చాప్టర్ కార్యవర్గ సభ్యులు ఉక్కు పరిపాలన భవనంలో నూతన డైరెక్టర్ (పర్సనల్)గా బాధ్యతలు స్వీకరించిన పాండేను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఎన్ఐపీఎం విశాఖ చాప్టర్ ఇప్పటి వరకు చేసిన కార్యక్రమాలు, భవిష్యత్తులో చేపడుతున్న అంశాల గురించి వివరించారు. దీనిపై డైరక్టర్ పాండే మాట్లాడుతూ పర్సనల్ మేనేజ్‌మెంట్‌లో ఎన్ఐపీఎం చాలా కీలకంగా ఉందని, చాప్టర్ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో చాప్టర్ కార్యదర్శి శేషగిరిరావు, చైర్మన్ డాక్టర్ మురళీధర్, డాక్టర్ సుధాకర్, అప్పారావు, జోగారావు, డాక్టర్ కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులకు చెక్

జెడ్సీ ఆర్జీవీ కృష్ణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న జోన్-5 జెడ్సీ కృష్ణ

మల్కాపురం: అపరిశుభ్రత వల్ల అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని జోన్–5 జెడ్సీ కృష్ణ అన్నారు. ఇంట్లో,ఇంటి చుట్టు పక్కల ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. డెంగ్యూ నివారణ మాసోత్సవం కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ 59వ వార్డు ములగాడ హౌసింగ్ కాలనీ వద్ద డెంగ్యూ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ కొబ్బరిబొండాలు,రబ్బరు టైర్లు, చెడిన పదార్థాలు ఇంట్లో ఉంటే దోమలు చేరి తద్వారా అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. అలాగే రోజుల తరబడి ఇంట్లో నీటి నిల్వ ఉంచరాదని సూచించారు.నీటిపై పైకప్పులు తప్పకుండా అమర్చాలన్నారు. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ మార్కెటింగ్ బోర్డు డైరెక్టర్ తోనంగి వెంకటరమణియాదవ్, జీవీఎంసీ పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుడికి విశేష పూజలు



సంపత్ వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



కలియుగ వెంకన్న పూజల్లో పాల్గొన్న భక్తులు

కంచరపాలెం: ఆషాఢ మాస శుద్ధ త్రయోదశి సందర్భంగా శనివారం వేంకటేశ్వరుడికి విశేష పూజలు నిర్వహించారు. గొల్లకంచరపాలెం సంపత్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడు శ్యామ్ ఆచార్యులు ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు, తిరువారాధన, అష్టోత్తరాలు, తులసీదళ బిల్వార్చనలు చేశారు. సమాజం గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ నేతృత్వంలో కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం వెంకన్నకు నక్షత్ర హారతి, భక్తి సంకీర్తన, పవలింపు సేవలు నిర్వహించారు.

- తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు చామర్తి శంకర్‌శర్మ, జగనాథశర్మ ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, అర్చనలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

పార్టీని నమ్ముకున్న వారందరికీ న్యాయం

పశ్చిమ సమన్వయకర్త
ఆడారి ఆనంద్‌కుమార్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: పార్టీని నమ్ముకుని ఉన్న ప్రతి కార్యకర్తకు గుర్తింపు లభిస్తుందని వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. 58వ వార్డు ములగాడలో శనివారం వార్డు పార్టీ అధ్యక్షుడు గులిగిందల కృష్ణ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ నామినేటెడ్‌పోస్టులు, కార్పొరేషన్ల ద్వారా కార్యకర్తలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పదవులిచ్చారన్నారు. 58వ వార్డులో రెండేళ్లలో సుమారు పది కోట్లకు పైగా అభివృద్ధి పనులు జరిగాయని చెప్పారు. మరో పది కోట్ల రూపాయిలతో మరిన్ని అభివృద్ధి పనులు త్వరలో చేపడుతున్నట్టు వివరించారు. వార్డులో పార్టీ బలోపేతంతో పాటు పలు సమస్యల పరిష్కారానికి కృష్ణ చూపిస్తున్న చొరవ అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య, వ్యవసాయ మార్కెటింగ్ బోర్డు డైరెక్టర్ చుక్క వరలక్ష్మి, కనక మహాలక్ష్మి దేవస్థానం ట్రస్టు బోర్డు మెంబర్ మళ్ల ధనలత, కొల్లి నూకరెడ్డి,ధర్మాల వేణుగోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ నిర్ణయం వెనక్కి తీసుకోవాల్సిందే..



నినాదాలు చేస్తున్న భోగవల్లి నాగభూషణం తదితరులు

మల్కాపురం: స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీ కరణ చేయాలనే ఆలోచనను కేంద్ర ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని లేని పక్షంలో తీవ్రంగా ఉద్యమిస్తామని ఐఎన్టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవల్లి నాగభూషణం హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని వ్యతిరేకిస్తూ సంస్థ ఉద్యోగులు జీవీఎంసీ గాంధీవిగ్రహం వద్ద చేపట్టిన దీక్షలకు శనివారం ఆయన సంఘీబావం తెలిపారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడుల్లా ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటీ కరణ చేయాలనే యోచన చేస్తుందన్నారు. లాభాల్లో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను తక్కువ రేటుకు బడాబాబులకు అప్పగించాలనే ఆలోచన బీజేపీది అని ఆరోపించారు. బీజేపీ తీరు ను దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు,ట్రేడ్ యూనియన్లు వ్యతిరేకిస్తున్నా కేంద్రం స్పందించడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో ఇంటక్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి రాయితీపై టమాటా విక్రయాలు

సీతమ్మధార: వ్యవసాయ, వాణిజ్య, మార్కెటింగ్ శాఖ అధికారి ఎస్.కె.యాసిన్ శనివారం సీతమ్మధార రైతుబజార్‌ను సందర్శించారు. కూరగాయల స్టాళ్లు, రైతుల ఐడీ కార్డులను పరిశీలించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం నుంచి రాయితీపై కిలో టమాటా రూ.50కు విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఆధార్ లేదా రేషన్ కార్డు వినియోగదారులు వెంట తీసుకురావాలన్నారు. సీతమ్మధార రైతుబజార్‌లో నాలుగు స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. జీవీఎంసీ అధికారులతో మాట్లాడి పార్కింగ్ సమస్యపై దృష్టి సారిస్తామన్నారు. యాసిన్ వెంట రైతుబజార్ ఈవో పి.కొండబాబు ఉన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన



జాబ్‌మేళాలో సంస్థల వివరాలు చూసుకుంటున్న విద్యార్థులు



జాబ్‌మేళాకు హాజరైన అభ్యర్థులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం వేదికగా అనుసంధాన్ సంస్థ నిర్వహించిన జాబ్ మేళాకు విశేషస్పందన లభించింది. శనివారం ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమైన జాబ్‌మేళా సాయంత్రం వరకు కొనసాగింది. మొత్తం 29 సంస్థలు పాల్గొన్నాయి. ఐటీ సంస్థల్లో 430, ఇతర సంస్థల్లో రెండు వేలకు పైగా ఉద్యోగాల భర్తీకి జాబ్‌మేళా నిర్వహించినట్లు అనుసంధాన్ సంస్థ వ్యవస్థాపకుడు, సీఈవో అడ్ల సుభాష్ తెలిపారు. విద్యార్థులకు ముందుగా ఒక నిర్దిష్టమైన బయోడేటా ఫారం అందించి, నిర్వాహకులు వివరాలు సేకరించారు. అనంతరం విద్యార్థుల విద్యార్హతలకు అనుగుణంగా నియామక ప్రక్రియ జరిపారు. పూర్తిస్థాయిలో ఏర్పాట్లు నిర్వాహకులు చేశారు. విద్యార్థులు కూర్చోవడానికి ప్రత్యేకంగా టెంట్లు, తాగునీరు, కుర్చీలు వంటివి ఏర్పాటు చేశారు. ఏయూ భౌతికశాస్త్రం, రసాయన శాస్త్రవిభాగంలోని సమావేశ మందిరాల్లో ఇంటర్వ్యూల ప్రక్రియ నిర్వహించారు.